క్లుప్తంగా

సీఐగా అంకమరావు బాధ్యతల స్వీకరణ

వెంకటాచలం : వెంకటాచలం సీఐగా బి.అంకమరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక సీఐగా ఉన్న గంగాధర్‌రావును ఓ కేసులో ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఈ నేపథ్యంలో మంగళగిరిలో పనిచేస్తున్న బి.అంకమరావును వెంకటాచలం సీఐగా నియమించడంతో సోమవారం ఉదయం వెంకటాచలం వచ్చి బాధ్యతలు చేపట్టారు.

బీమా సాయం అందజేత



బుచ్చిరెడ్డిపాళెం : నగర పంచాయతీ పరిధిలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన యాకసిరి శ్రీనుకు స్థానిక కౌన్సిలర్ శ్రీదేవి వైఎస్సార్ బీమా కింద రూ.10 వేలను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల రోడ్డు ప్రమాదంలో యాకసిరి రమణయ్య మృతి చెందాడని, అతనికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలను రమణయ్య కుమారుడు శ్రీనుకు అందజేశామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నేతలు పెంచలయ్య, హనుమారెడ్డి, సచివాలయ సిబ్బంది శ్రీలత, రేణుక పాల్గొన్నారు.

డాక్టర్ మురళీకృష్ణకు సత్కారం



ముత్తుకూరు : మండలంలోని పాటూరువారి కండ్రిగ పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తూ స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసిన డాక్టర్ మురళీకృష్ణ, ఆయన సతీమణి సాయిలక్ష్మిలను సోమవారం ఘనంగా సత్కరించారు. స్థానిక విద్యావనరుల కేంద్రంలో జరిగిన వీడ్కోలు సమావేశంలో ఎంపీడీఓ ప్రత్యూష, ఎంపీపీ గండవరం సుగుణ, ఎంఈఓలు మధుసూదన, హేమసుందరరావు, ఈదూరు రామ్మోహనరెడ్డి, సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ రాజారామరెడ్డి, లక్ష్మణరెడ్డి తదితరులు ప్రసంగించారు. విద్యాబోధన, క్రమశిక్షణ, అంకితభావం కలిగిన డాక్టర్ జీవీబీ మురళీకృష్ణ ఉపాధ్యాయులకే ఆదర్శంగా నిలిచారని కొనియాడారు.

మాదకద్రవ్యాలతో ప్రాణాలకు ముప్పు

ఇందుకూరుపేట : మాదకద్రవ్యాలతో ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని ఎస్‌ఈబీ సీఐ బాలకృష్ణ తెలిపారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై ఇందుకూరుపేటలోని ఉన్నత పాఠశాలలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాల వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. వీటి పట్ల యువతలో చైతన్యం తేవాల్సిన అవసరం ఉందన్నారు. ఉన్నత స్థాయిలో రాణించాల్సిన యువత మాదకద్రవ్యాలకు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకుంటున్నట్లు వెల్లడించారు. అనంతరం మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎ.జనార్దన్, మహిళా పోలీసు ఎస్.రేష్మితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని తప్పక తీసుకోవాలి

కొడవలూరు : పోషకాలున్న ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యకర ప్రసవానికి మార్గం సుగమం అవుతుందని ఏసీడీడీపీఓ టి.అరుణ సూచించారు. పౌష్టికాహార మాసోత్సవంలో భాగంగా మండలంలోని టపాతోపులో గర్భిణులు, బాలింతలకు పోషక విలువలున్న ఆహారంపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషకాహార లోపం వల్ల రక్తహీనత లాంటి సమస్యలు తలెత్తుతాయన్నారు. ఫలితంగా ఆరోగ్యకర బిడ్డకు జన్మనివ్వడం కుదరదన్నారు. మార్కెట్‌లో తక్కువ ధరకు లభ్యమయ్యే పోషకాలున్న ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యకర బిడ్డకు జన్మనివ్వవచ్చన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు టి.నాగభూషణమ్మ, ఎస్.నిర్మల, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మైపాడులో సీమంతాలు

ఇందుకూరుపేట : పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని మైపాడులో గర్భిణులకు సోమవారం సీమంతాలు నిర్వహించారు. అనంతరం ఫుడ్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల మాట్లాడుతూ మంచి పోషకాలున్న ఆహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఇక్కడ ఇచ్చే పౌష్టికాహారాన్ని క్రమ పద్ధతిలో తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు వెంకటరమణమ్మ, కృష్ణవేణి, మంజుల, రేణుక, సీత తదితరులు పాల్గొన్నారు.

సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపండి



అర్జీలను స్వీకరిస్తున్న వికాస్ మర్మత్

నెల్లూరు సిటీ: స్పందనలో ప్రజలు తెలియజేసిన సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడారు. నిర్ణీత గడువులోపు సమస్యలను పరిష్కరించాలని సూచించారు. నీటి పన్ను బకాయిలను వసూలు చేయాలని తెలిపారు. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో పారిశుధ్య నిర్వహణ, కాలువలను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని పేర్కొన్నారు. పశువులు రోడ్లపైకొస్తే వాటి యజమానులకు నోటీసులను జారీ చేయాలని ఆదేశించారు. టిడ్కో గృహాలకు సంబంధించి వస్తున్న అభ్యర్థనలపై విచారణ జరిపి గృహాలను అర్హులకు కేటాయించాలని తెలిపారు. కార్పొరేషన్‌కు వస్తున్న స్పందన ఫిర్యాదులను తగ్గించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు.

వ్యాధులపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న పెంచలయ్య

నెల్లూరు(సెంట్రల్): చిన్నారులకు వచ్చే పలు వ్యాధులపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించి వాటి నివారణకు తగు చర్యలు చేపట్టాలని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య పేర్కొన్నారు. పుట్టుకతో చిన్నారుల్లో వచ్చే లోపాలపై వైద్యులు, సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నగరంలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. చిన్నపిల్లల వైద్యులు సురేష్‌బాబు, ఖాదర్‌వలీ, సుధీర్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వేదగిరిలో విశేష పూజలు



ధ్వజస్తంభానికి పూజలు



పూజలకు హాజరైన ఎంపీ వేమిరెడ్డి దంపతులు

నెల్లూరు రూరల్: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నూతన ధ్వజస్తంభ సంప్రోక్షణ పూజలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా విశేష హోమాలు, కుంభారాధన, మహాపూర్ణాహుతి, కుంభాభిషేకాలను ఆగమ విద్వాన్ సత్యనారాయణాచార్యులు, ఆలయ ప్రధానార్చకుడు భాస్కరాచార్యులు పర్యవేక్షణలో వేదపండితులు నిర్వహించారు. రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ మర్యాదలతో వీరికి స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు. ధ్వజస్తంభ దాత కాకాణి నరహరి రెడ్డి, ఆలయ చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఆంధ్రప్రదేశ్ పర్యావరణ పరిరక్షణ సమితి సెక్రటరీ ఆదిశేషయ్య పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణపై వెంకటేశ్వరపురంలోని నగరపాలక ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. అనంతరం మొక్కలు నాటుతామనే ప్రతిజ్ఞను విద్యార్థులతో చేయించారు. జీఎస్టీ అధికారి చంద్రశేఖర్, స్కూల్ అసిస్టెంట్ రాజమనోహర్, ఉపాధ్యాయులు ఖాదర్ రహంతుల్లా, లక్ష్మయ్య, రమణయ్య, ధన్‌రాజ్, లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

సలీమ్‌కు ఎంపీ మస్తాన్‌రావు పరామర్శ



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నూర్‌బాషా సంఘ జిల్లా అధ్యక్షుడు సలీమ్ తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో శాంతినగర్‌లోని ఆయన నివాసానికి రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు సోమవారం విచ్చేశారు. ఈ సందర్భంగా తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసి నివాళులర్పించారు. బీసీ సంఘ మాజీ అధ్యక్షుడు దేవరాల సుబ్రహ్మణ్యం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత హరిబాబుయాదవ్, జీజీహెచ్ వైద్యుడు మస్తాన్‌బాషా, నూర్‌బాషా సంఘ నేతలు బాబర్‌జాన్, హుస్సేన్ సాహెబ్, ఖాజావలీ, మస్తాన్, మౌలాలీ, సందానీ, అంకయ్య, శ్రీనివాసనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలి



మాట్లాడుతున్న వాసుదేవరావు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రానున్న పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి వాసుదేవరావు మాదిగ పేర్కొన్నారు. నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో విలేకరుల సమావేశంలో సోమవారం ఆయన మాట్లాడారు. వర్గీకరణపై కాంగ్రెస్ పార్టీ స్పందించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎమ్మార్పీఎస్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా కన్వీనర్‌గా గోసాల సుధాకర్, కో కన్వీనర్లుగా ఉదయ్‌కృష్ణ, లక్ష్మయ్య, గంగాధర్, చందు ఎన్నికయ్యారు. నేతలు అంబేడ్కర్, వెంకటేశ్వర్లు, ,రమేష్, శేషయ్య, లక్ష్మమ్మ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రేపట్నుంచి కృష్ణాష్టమి మహోత్సవాలు



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్‌లోని పిండి మిల్లు సెంటర్ వద్ద కృష్ణాష్టమి ఉట్టి మహోత్సవాలను బుధవారం నుంచి ఈ నెల పది వరకు నిర్వహించనున్నామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత గణేశం వెంకటేశ్వర్లురెడ్డి పేర్కొన్నారు. కృష్ణాష్టమి మహోత్సవాలకు సంబంధించిన గుంజ ప్రతిష్టను సోమవారం నిర్వహించిన అనంతరం కార్యక్రమ ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకుడు కొట్టే వెంకటేశ్వర్లు మాట్లాడారు. కృష్ణుడి విగ్రహాన్ని బుధవారం రాత్రి ఎనిమిది గంటలకు ప్రతిష్ఠించనున్నామని, పూజా కార్యక్రమాలు, ఉట్టి మహోత్సవాన్ని గురువారం నిర్వహించనున్నామని వెల్లడించారు. పూజా కార్యక్రమాలను రోజూ నిర్వహించనున్నామని, భక్తులు విశేషంగా హాజరుకావాలని కోరారు. లయన్స్‌క్లబ్ నిర్వాహకుడు సత్యనారాయణ, బాలాజీనగర్ యూత్ సభ్యులు తిరుపాల్‌రెడ్డి, రమేష్‌రాజు, జీవన్‌శేఖర్, దుర్గ, శివ, చక్రి, అనిల్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళా రేపు

నెల్లూరు(మినీబైపాస్): కొత్తూరు సమీపంలోని ఎస్సార్‌ఆర్ ఐటీఐ ఆవరణలో కాంటినెంటల్ కాఫీ శ్రీసిటీ ఆధ్వర్యంలో జాబ్ మేళాను బుధవారం నిర్వహించనున్నామని కరస్పాండెంట్ రెహ్మాన్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐటీఐ ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ మెషినిస్ట్, టర్నర్, వెల్డర్, తదితర ట్రేడ్లలో ఉత్తీర్ణులైన వారు అర్హులని చెప్పారు. 50 ఖాళీలున్నాయని, వివరాలకు 97039 67967 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

వేడుకగా కుంభాభిషేకం



నెల్లూరు రూరల్: సౌత్‌మోపూరులో నిర్మించిన కామాక్షిదేవి సమేత నాగేశ్వరస్వామి ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేకాన్ని వేడుకగా సోమవారం నిర్వహించారు. పూజలకు జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి హాజరయ్యారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత చెవిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘన సన్మానం



నెల్లూరు(పొగతోట): ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు చేపడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వోద్యోగుల ఫెడరేషన్ జిల్లా చైర్మన్ చేజర్ల సుధాకర్‌రావు, రమణారెడ్డి సత్కరించారు. ఈ మేరకు ఆయన్ను మర్యాదపూర్వకంగా సోమవారం కలిశారు.

కృష్ణాష్టమి వేడుకలకు మంత్రికి ఆహ్వానం



నెల్లూరు(బృందావనం): కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా నగరంలోని ఎన్టీఆర్‌నగర్‌లో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక నెల్లూరు శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 12న నిర్వహించనున్న నగరోత్సవానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని సంస్థ నిర్వాహకులు సోమవారం ఆహ్వానించారు. పొదలకూరు రోడ్డులోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో కలిసి ఆహ్వాన పత్రికలను అందజేశారు. సంస్థ నగరాధ్యక్షుడు సురమౌళి తదితరులు పాల్గొన్నారు.

నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

మనుబోలు : వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థినులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రమేష్ అన్నారు. మనుబోలు మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల, బాలుర వసతిగృహాలను సోమవారం ఉదయం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం, అల్పాహారం అందజేస్తున్నారా.. అని విద్యార్థినులను ఆరా తీశారు. ఆయన వచ్చిన సమయంలో మేట్రిన్ మహేశ్వరి హాస్టల్‌లో లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వసతిగృహాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ 74 మంది విద్యార్థినులు ఉండగా సుమారు 30 మందికి అదనంగా ఎలా బిల్లులు పెడుతారని మేట్రిన్‌ను ప్రశ్నించారు. 74 మందికి మాత్రమే బిల్లు చెల్లించేలా ఆదేశాలు ఇస్తామన్నారు. మేట్రిన్ స్థానికంగా నివాసముంటూ హాస్టల్‌లో విద్యార్థినులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలన్నారు. దీనికి మేట్రిన్ మహేశ్వరి వివరణ ఇస్తూ ఆన్‌లైన్‌లో విద్యార్థినుల వేలిముద్రల ఆధారంగానే మెస్ బిల్లులు పెడుతున్నామని తెలిపారు. స్థానికంగానే నివాసముంటున్నానన్నారు. అనంతరం పిడూరు తూము వద్ద ఉన్న బాలుర వసతిగృహాన్ని డీడీ పరిశీలించారు. అక్కడ కేవలం ఎనిమిది మంది విద్యార్థులు మాత్రమే ఉండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇంత తక్కువ మంది విద్యార్థులు ఎందుకు ఉన్నారని వార్డెన్ సుధాకర్‌ను ప్రశ్నించారు. కరోనాకు ముందు 60 మందికి పైగా విద్యార్థులు ఉండేవారని, కరోనా మొదలు హాజరు తగ్గిపోయిందని సుధాకర్ వివరణ ఇచ్చారు. విద్యార్థుల సంఖ్యను పెంచాలని వార్డెన్‌కు సూచించారు.

ఇళ్ల పట్టాల పంపిణీ



అందజేస్తున్న అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని పొర్లుకట్టలో గల బాణసంచా కేంద్రంలో గతంలో సంభవించిన ప్రమాదంలో 15 మంది మృతి చెందడంతో వారి కుటుంబసభ్యులకు ఇళ్ల పట్టాలను నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ సోమవారం అందజేశారు. నగరంలోని రాజన్న భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వారికి ఇళ్లను త్వరలో నిర్మించనున్నామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో సాలుచింతలలో అర్ధరాత్రి ఇళ్లు తొలగించి అక్కడి ప్రజలను రోడ్డున పడేశారని ఆరోపించారు. తమ ప్రభుత్వం ఏర్పడ్డాక వారికి స్థలంతో పాటు గృహాలను నిర్మించిస్తున్నామని తెలిపారు. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 48వ డివిజన్ ఇన్‌చార్జి సిద్ధిఖ్, వందవాసి రంగ తదితరులు పాల్గొన్నారు.

యూపీహెచ్‌సీలో తనిఖీ



మాట్లాడుతున్న ఖాదర్‌వలీ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని జనార్దన్‌రెడ్డి కాలనీలో గల వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నియంత్రణాధికారి ఖాదర్‌వలీ సోమవారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని రికార్డులు, ల్యాబ్‌ను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఆరోగ్య కేంద్ర పరిధిలో టీబీ నిర్ధారణ పరీక్షలను పెంచాలని, అందుబాటులో ఉన్న 60 రకాల రక్త పరీక్షలు, 172 రకాల మందులను రోగులకు ఉచితంగా అందజేయాలని ఆదేశించారు. టీబీ సోకిన వారిని పరామర్శించి.. మందులు ప్రతి నెలా అందుతున్నాయా అనే అంశాన్ని ఆరా తీశారు. అనంతరం వెంకటేశ్వరపురంలోని కార్పొరేషన్ హైస్కూల్లో కౌమార దశ విద్యార్థినులకు నిర్వహిస్తున్న రక్తహీనత నిర్ధారణ పరీక్షలను పరిశీలించారు. క్షయ నివారణ, పరిశుభ్రతపై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యాధికారి దేశ్‌కుమార్, ప్రధానోపాధ్యాయురాలు మంజులవాణి, రాజమనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఏమనుకోకండి ఆంటీ..!

- వృద్ధురాలిని కత్తితో బెదిరించి.. ఆపై చైన్ అపహరణ
- పరారవుతూ దుండగుడి వింత సంబోధన



బాధితురాలి నుంచి వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

నెల్లూరు(క్రైమ్): వృద్ధురాలిని కత్తితో బెదిరించి.. ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తి తెంపుకెళ్లాడు. ఆపై ఏమనుకోకండి ఆంటీ అంటూ పరారైన ఘటన బాలాజీనగర్‌లో సోమవారం పట్టపగలు చోటుచేసుకుంది. వివరాలు.. బాలాజీనగర్‌లోని 19వ అడ్డరోడ్డులో విశ్రాంత ఉపాధ్యాయురాలు శ్రీలక్ష్మమ్మ తన కుమారుడు రాధాకృష్ణ, కోడలు మంజువాణితో కలిసి నివసిస్తున్నారు. రామచంద్ర మిషన్ తరఫున ఇంట్లోనే ధ్యాన శిక్షణ కేంద్రాన్ని శ్రీలక్ష్మమ్మ నిర్వహిస్తున్నారు. చుట్టుపక్కల వారు వచ్చి ఆమె వద్ద శిక్షణ పొందుతున్నారు. కుమార్తెలను చూసేందుకు గానూ హైదరాబాద్‌కు రాధాకృష్ణ ఈ నెల ఒకటిన వెళ్లారు. తెలిసిన వారి ఇంట్లో సత్యనారాయణ స్వామి వ్రతానికి మంజువాణి సోమవారం మధ్యాహ్నం వెళ్లారు. ఈ క్రమంలో శ్రీలక్ష్మమ్మ ఒంటరిగా ఇంట్లో ఉన్నారు. మధ్యాహ్నం 1.40 గంటల ప్రాంతంలో ధ్యాన శిక్షణకు సంబంధించిన అంశాలను ఇంటి వరండాలో ఆమె రాసుకోసాగారు. ఈ తరుణంలో మొహానికి మాస్క్ ధరించిన గుర్తుతెలియని దుండగుడు ఆంటీ అని పిలుస్తూ ఇంట్లోకి ప్రవేశించాడు. అరిస్తే చంపుతానని ఆమెను కత్తితో బెదిరించి.. గొంతు నులిమి కిందపడేశాడు. ఆమె మెడలోని 46 గ్రాముల బంగారు దండను కట్టర్‌తో తెంపి ఏమనుకోకండి ఆంటీ అంటూ పరారయ్యాడు. ఊహించని పరిణామంతో కంగుతిన్న వృద్ధురాలు కొద్దిసేపటికి తేరుకొని బయటకొచ్చి అరిచేలోపే దుండగుడు ఉడాయించాడు. దీంతో విషయాన్ని కుటుంబసభ్యులకు ఫోన్ ద్వారా ఆమె తెలియజేశారు. 112కు కాల్ చేశారు. ఘటన స్థలాన్ని నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ రాములునాయక్ పరిశీలించారు. వృద్ధురాలిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఘటన స్థలంతో పాటు సమీపంలోని సీసీ ఫుటేజీలను సేకరిస్తున్నారు. సాంకేతికత, ఆధారంగా నిందితుడ్ని గుర్తించే పనిలో పోలీస్ అధికారులు నిమగ్నమయ్యారు.

రాజరాజేశ్వరి అమ్మవారి సేవలో..



నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారిని రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులు సోమవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వీరిని ఈఓ ఆర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి, రాజరాజేశ్వరి అమ్మవారి సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, ధర్మకర్తల మండలి అధ్యక్షుడు రత్నం జయరామ్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించారు. తమ దాతృత్వంతో జరుగుతున్న అభివృద్ధి పనులను వారు పరిశీలించారు. అనంతరం ఇరుకళల పరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. ఈఓ మల్లికార్జునరెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీనివాసరావు తదితరులు ఆహ్వానించారు. దేవస్థాన అభివృద్ధికి సహకరించాలని కోరగా, వారు సానుకూలంగా స్పందించారు. విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, దేవదాయ శాఖ జిల్లా అధికారి శ్రీనివాసరావు, నేతలు రాములమ్మ, బాబీ, సన్నపురెడ్డి సుబ్బారెడ్డి, శరత్‌చంద్ర, వాసంతి, అవినాష్, సునీల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార వారోత్సవాలు ప్రారంభం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): రంగనాయకులపేట సెక్టార్ పరిధిలోని గొల్లవీధిలో గల అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార వారోత్సవాలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీడీపీఓ అన్నపూర్ణమ్మ మాట్లాడారు. పౌష్టికాహారంపై అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నామని చెప్పారు. చిరుధాన్యాలతో కలిగే ప్రయోజనాలు.. వాటిని తయారు చేసే విధానాన్ని తెలియజేశారు. అనంతరం బాలింతలకు పౌష్టికాహారాన్ని అందజేశారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, టీచర్లు కల్పన, సీత, సుధ, సుభాషిణి, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాయప్పకు అభినందన



నెల్లూరు(బృందావనం): సమాజ సేవకుడిగా ఎన్నో కార్యక్రమాలను చేపట్టిన అరవ రాయప్పను గాంధీబొమ్మ సమీపంలోని స్వతంత్ర పార్కులో సోమవారం సత్కరించారు. సంకీర్తన కళాసమితి వ్యవస్థాపకుడు చింతా ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కేతా సుబ్బారావు, మహేష్, మురళీమోహన్‌రావు, రవీంద్ర, ఉమామహేష్, రాచపాళెం రఘు, సత్యం, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.